# పరోక్షము - సమక్షము

వేణీరావు, హనుమాయమ్మ, నేను ఎట్లాగో అవస్థపడి కలకత్తా మెయిలు అందుకున్నాము. టిక్కెట్లు ఎంతముందుగా తెప్పించుకొన్నా మేము బయలుదేరిన సమయాన్నిబట్టి రైలు అందుతుందని అనుకోలేదు. రాత్రిపూట చిన్న చిన్న స్టేషనులలో పెద్ద తరగతుల పెట్టెల తలుపులను తెరిపించేలోపల రైలు కదులుతూ ఉంటుంది. గార్డుచేసిన హంగామాతో మేము ఎట్లాగో ఎక్కటము జరిగింది. రిజర్వు చేసుకోలేకపోయినా ప్రయాణీకులు హాయిగా కాళ్లుచాపుకొని నిద్ర పోతున్నారు. చొరవ చేసుకోలేని మేము ముగ్గురము మా పెట్టెమీద కూర్చున్నాము. ప్రయాణీకుల సౌకర్యార్థము కాబోలు దీపము ఆర్పివేయబడ్డది.

ఒక స్టేషను దాటిన తరువాత-వేణీరావు నా చేతిమీద తట్టి "ఆ మూలగా-పైబెర్తుమీదనుంచి వినబడుతున్న మాటలను ఆలకించు" అన్నది.

"ఈ రోజుల్లో సంఘసేవ చేయని ఆడవాళ్ళు ఉన్నారంటారా? చేతి సంచులతో ఎక్కడ చూసినా వాళ్లేనంటే నమ్ముతారో-లేదో!"

ఆ కంఠస్వరము ఆగకముందే రెండుమూడు గొంతులు పెద్దగా నవ్వాయి.

"వాళ్ల షోకులనుగురించి చెప్పాలంటే ఎన్ని రోజులయినా చాలవనుకోండి. మనము ఎంత తలవంచుకొన్నా-వాళ్ళే పలకరించి మాట కలుపుతారు. నాకు వాళ్ల మొగుళ్లను తలుచుకుంటే విపరీతమైన జాలి కలుగుతూ ఉంటుంది"

విన్న వాళ్ళంతా తన ధోరణికి మెచ్చి అభినందన పూర్వకముగా నవ్వుతారని కాబోలు కాసేపు ఆగినట్లున్నాడు.

"మీకు అనుభవము ఉన్నదో లేదో-నలుగురు ఆడవాళ్ళు ఉంటారా-ఒకరితో మాట్లాడుతూ ఉంటే మరొకరికి కోపము. విధీ విసుగు లేకుండా పొగుడుతూ ఉంటేనే వాళ్ళు మనుష్యులనుకోండి."

అతడికి ప్రోత్సాహకరముగా ఈసారి నవ్వులు బాగా వినిపించాయి.

"ఏమిటో-పిల్లల తండ్రులను చూస్తే నాకు విపరీతమైన జాలి. ఎందుకో! మీకో తమాషా సంగతి చెప్తాను వినండి. ఈరోజుల్లో మనసుడిని ఎత్తుకుంటూ కూడా ఆడవాళ్ళ పౌడరు పూసుకుంటున్నారు. ఈ సంగతి తెలుసునా?"

ఈసారి సుమారు పదిగొంతులు కలిసి నవ్వినట్లే నవ్వాయి. అప్పుడు వేణీ రావు ముఖము వెలుతురులో చూడగలిగితే ఎంత ఎర్రబడ్డదో తెలిసేది. మా హను మాయమ్మకు నిద్రే సరిపోయింది.

తరువాత మాకు మాటలు సరిగా వినపడలేదు కాని. అప్పుడప్పుడు నవ్వులు మాత్రము వినబడుతూ వచ్చాయి. తెల్లవారవచ్చింది. మెయిలు వేగము రాత్రికంటె కాస్త తగ్గినట్లనిపించింది. రైలు ఆగగానే మేము పెట్టెను కాస్త ప్రక్కకు జరిపి కూర్చున్నాము.

అయిదారుగురు గబగబా తోసుకుంటూ లోపలికివచ్చారు. మాకు వెనుకగా ఉన్న బర్తుదగ్గరగా నిలబడి "ఆయన ఇంకా లేవనట్లున్నారు. కాసేపు నిలబడ దామా పోనీ-" అనుకుంటున్నారు. ఈ సందడికి ఆయన లేవనే లేచాడు. ఎన్ని రకముల అభినందనాలో-ఎన్ని పూలహారాలో లెక్కలేదు. వాళ్ళ ఆనందోత్సాహా లతో ఆయనకు ఊపిరి సలుపలేదు. అయినా చిరునవ్వుతో అన్నీ స్వీకరిస్తున్నాడు. వాళ్ళు స్పెన్సరు కాఫీ బిస్కెట్లు యిచ్చారు. ఆ స్టేషనులో దొరకే పత్రికలన్నీ ఆయనకు కొని యిచ్చారు. ఆయన "వద్దు! నాకెందుకు ఇవన్నీ?" అంటూనే రైలుదిగి-ప్లాటుఫారము మీద నిలబడి వాళ్ళ ఫోటో తీస్తామనగానే పూలహారాలు జరీ కండువా సర్దుకొన్నాడు!

ఇంత హడావుడి ఏమిటా అని కనుక్కుంటే ఆయనట ఒక సినెమా నటుడట.

ఏలూరు స్టేషను వచ్చేసరికి బండి లేటు అయిందేమో ఎనిమిదిన్నర కావచ్చింది.

అప్పటికి ప్రయాణికులు చాలావరకు దిగిపోయారు. పై బర్తులమీద ఉన్న వారందరూ క్రిందికి దిగారు.

మేము మాటల సందడిలో రైలు నాలుగు స్టేషనులు దాటడము గమనించనే లేదు.

అంతలో ఒక యువకుడు కూర్చున్న స్థలములోనుంచి లేచివచ్చి, మా కెదురుగా కూర్చొని, ఇంగ్లీషు డైజెస్టు చదవటము మొదలు పెట్టాడు. కొంతసేపటికి గాని అతను సరిగా చదవటము లేదని మేము కనుక్కో-లేక పోయాము. మాలోకి కాస్త చూడటానికి బాగుండేది హనుమాయమ్మ నాలుగేళ్ళు పెద్దదయినా షాపుల ముందర నిలబెట్టబడిన బొమ్మలా అలంకరించుకునేది వేణీరావు.

"నమస్కా-రమండీ" అన్నా డాయువకుడు మావైపు తిరిగి. నేను ఆ నమస్కా-రము 'ఎవరికా' అనుకున్నాను. హనుమాయమ్మ తనకేమోనని సందేహమైనా పడదు. వేణీరావు అందుకున్నది.

"సమితికి చాలామంది సభ్యులున్నారా? మీరు ఆర్గనైజరులా?" అడిగాడు కుతూహలముతో.

అతడు దేనినిగురించి అడుగుతున్నాడో తెలియక నేనూ హనుమాయమ్మా తెల్లబోయాము. వేణీరావు జవాబిచ్చింది. "వెయ్యిమంది వరకు సభ్యు లున్నారు. వీళ్ళిద్దరు కార్యనిర్వాహక వర్గ సభ్యురాండ్రు. నేను కార్యదర్శినిని."

అతడు అందుకు తన సంతోషాన్ని తెలుపుతూ ఆ సమితి రిపోర్టు, నియమావళి ఇమ్మని అడిగాడు. ప్రస్తుతము అవి తనదగ్గర లేవని చెప్పుతూ-అనాథ శరణాలయము, హిందీక్లాసులు, వయోజన పాఠశాల, చేతిపనులు, బాలెంతల వైద్యశాల ఏకధాటిగా నడుపబడుతున్నాయని వేణీరావు అనర్గళముగా చెప్పేసింది. అతడు వాటి వివరాలను ఫొటోలను యిమ్మంటున్నాడు. ఆమె వెళ్లి పంపుతానన్నది. తన చిరునామా తెలుపటానికి అతడు ఒక కార్డు ఇచ్చాడు. ప్రసన్న వదనముతో వేణీరావు అందుకొని తన సంచీలో పెట్టుకొన్నది.

"ఇప్పుడు స్త్రీలల్లో కూడా త్యాగమూర్తులు ఉద్భవిస్తున్నారు. సమాజ సేవకురాండ్రంటే నాకెంతో గౌరవము. మీకు ఎంత సామర్థ్యము లేకపోతే మీ యిళ్లతోపాటు సంఘాన్ని దిద్దగలుగుతారు! ఒక్కొ-క్క- ఊళ్ళో ఎంత సోషల్ సర్వీసు చేస్తున్నారంటారు స్త్రీలు? ప్రతిశాఖ యంత్రములా నడుపబడుతున్నది. నా విచారమంతా ఒక్క- దానికే-ఏమిటంటే-మన సంఘము ఉన్నదే-అది స్త్రీమూర్తి

విలువలను ఇంకా గ్రహించలేకపోతున్నది. మిమ్మల్ని కలుసుకునే భాగ్యము నాకు కలిగినందుకు చాలా సంతోషము. నమస్కారము. వెళ్ళివస్తాను” అంటూ అతడు రైలుదిగి వెళ్ళిపోయాడు.

రైలు కదిలేవరకూ నిగ్రహించుకొని-ఈ నాటకమంతా ఏమిటంటే-వేణీరావు తన పెట్టెకు అంటించిన “మహిళాసమితి” అనే కాగితము చూపించింది. అప్పటికీ నాకు అర్థము కాకపోయింది.

“ఈ కార్డు చూడు. అతడొక పత్రికా విలేఖరట!” అంటూ ఒక కార్డు నా చేతికిచ్చింది. “రాత్రంతా మాట్లాడిన ఆ గొంతు విన్నావుకదా. ఆమాత్రము కంఠస్వరము గుర్తించలేవూ?” అన్నది వేణీరావు నా ముఖము చూస్తూ. నేను తెల్లబోయాను.

ఆమె వాక్యము పూర్తిచేయక ముందే మేము దిగవలసిన స్టేషను వచ్చింది. దిగిన తరువాత నేను అతడిని గురించే ఆలోచిస్తున్నాను- ‘ఆ నటుడికి సన్మానము చేసినవాళ్ళలో ఈ విలేఖరికూడా ఉన్నాడా - లేక ఎక్కడైనా ఉన్నాడా? విలేఖరి కనుక తప్పకుండా ఎక్కడో ఉండే ఉంటాడు’ అని సమాధాన పడ్డాను. అంతలో వేణీరావు కూలివాడితో పెట్టెను తీసుకొని రమ్మని చెప్పుతూ “అత డెంత పత్రికా విలేఖరో నేనంత సంఘ సేవకురాలిని!” అని పెట్టెకు అంటించిన చీటీకాస్తా లాగి పారేసింది.